క్లుప్తంగా

గ్యాస్ ధరలు తగ్గించాలి

కారేపల్లి: కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. మండలంలోని గాంధీనగర్‌లో ఐద్వా ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రమణతో పాటు ఉమావతి, లక్ష్మి, సీతమ్మ, జగ్గమ్మ, వసంత, జ్యోతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

కారేపల్లి: గ్రామపంచాయతీ నిధుల నుంచి మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ వర్కర్లు కారేపల్లి మండల పరిషత్ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన నిర్వహించారు. మల్టీపర్పస్ వర్కర్లకు 6 నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. జీపీ వర్కర్లు షేక్ హుస్సేన్, భాస్కర్, రమేష్, క్రాంతికిరణ్, రాంబాబు, సూక్యా, చిన్న, రాజు, యాదగిరి, తిరపయ్య, సుల్తానా పాల్గొన్నారు.

జామాయిల్ తోటలో మంటలు

వైరారూరల్: జామాయిల్ తోటలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించగా, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఆర్పేశారు. మండలంలోని అష్టగుర్తి సమీపంలో రైతు మాచినేని సతీష్ ఎనిమిది ఎకరాల్లో జామాయిల్ సాగు చేస్తుండగా, సోమవారం మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలు ఆర్పేశారు. అయితే, తోటకు నష్టం జరగకపోవడంతో రైతు ఊపిరిపీల్చుకున్నాడు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

వైరారూరల్: మండలంలోని కొండకొడిమ లో అంగన్వాడీ–2 సెంటర్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆరోగలక్ష్మిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ షేక్.బీజాన్‌బీ గర్భిణులు తప్పనిసరిగా టీకాలు వేసుకోవాలని సూచించారు. తక్కువ బరువు కలిగిన పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్ సీహెచ్.సునీత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రైతుల కుల నమోదు అనాగరిక చర్య

వైరా: ఎరువుల దుకాణాలలో రైతు కులం నమోదు అనాగరిక చర్య అని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం రసాయన ఎరువులు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా సోమవారం వైరాలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి కేంద్ర ఉత్తర్వుల ప్రతులను దహనం చేశారు. తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శి చలపతిరావు, నాయకులు నాగేశ్వరరావు, సుధాకర్, సంక్రాంతి నరసయ్య, కృష్ణారావు, శ్రీనివాసరావు, నాగరాజు, రామకృష్ణ, నరేష్, నరసింహారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్రూట్ ఫెస్టివల్



ఫ్రూట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

మధిర: స్థానిక మిలీనియం టాలెంట్ హైస్కూల్‌లో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు సాదినేని రాజేశ్వరి ఆధ్వర్యంలో ఫ్రూట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఎంఈఓ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికి తీసే ఇటువంటి ప్రయత్నం బాగుందని హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అభినందించారు.

పశువైద్య శిబిరం

మధిర: మండలంలోని ఇల్లందులపాడు లో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం పశువులకు ఉచిత గర్భకోశ వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి ఉమాకుమారి సమక్షంలో పశువులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో కోనా మోహన్‌రావు, మురళీకృష్ణ, లక్ష్మణరావు, సురేష్, వలరాజు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు..


మధిర: పట్టణంలోని సీపీఎస్ ఉన్నత పాఠశాలలో దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పృథ్వీ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ మధ్య ఘర్షణ

మధిర: మండలంలోని మాటూరులో సోమవారం ఉపాధి హామీ పథకం సభ ఏర్పాటుచేయగా, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మధ్య వివాదం నెలకొంది. చెప్పిన మాట వినడం లేదని గ్రామపంచాయతీ సెక్రటరీ వై.వీ.రెడ్డి చెప్పగా, ఆయన చెబితే తానెందుకు వినాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు అనడంతో మొదలైన గొడవ దాడికి దారి తీసింది. పాల్పడుతూ దూషించుకున్నారు. కాగా, ఎంపీడీఓ కె.విజ యభాస్కర్ రెడ్డి ఇద్దరికి సర్దిచెప్పినట్లు సమాచారం.

కొత్త కార్డుల్లో పేరెక్కేదెప్పుడో..?

- నాలుగేళ్ల నుంచి ఎదురుచూపులు
- అదనపు పేర్ల నమోదుకు లేని అనుమతి
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్న అర్హులు
- ఇబ్బందులు పడుతున్న పేదలు



వేంసూరు: అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందక తీవ్రంగా నష్టపోతున్నారు. నాలుగేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో కొత్త కార్డులకు మోక్షం కలుగడం లేదు. పాత కార్డుల్లో కొత్తవారిని చేర్చుకునేందుకు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తుదారులు అధికారుల చుట్టు తిరుగుతున్నా వారి దరఖాస్తులకు మాత్రం అనుమతులు రావడంలేదు. నాలుగేళ్లవుతున్న ప్రభుత్వం రేషన్ కార్డులకు అనుమతి ఇవ్వకపోవడంతో అధికారులు కూడా దరఖాస్తులను తీసుకుని పరిశీలించి ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు.

నాలుగేళ్లుగా మార్పులు, చేర్పులకు అవకాశం లేదు..

మండలంలో నాలుగేళ్లుగా మార్పులు, చేర్పులకు అవకాశం రావడంలేదు. అర్హులైన వారు ప్రతి రోజు మండల స్థాయి అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రేషన్ కార్డులు అందించాలని కోరుతున్నారు. వీరితో పాటు రేషన్ కార్డులో పేర్లు ఎంట్రీ చేయాలని దరఖాస్తు చేస్తున్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్నవారితో పాటు పుట్టిన పిల్లల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేస్తున్నారు. గత నాలుగేళ్లగా ఆన్‌లైన్ కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించకపోవడంతో వందల మంది రోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

కార్డుల కోసం భారీగా దరఖాస్తులు..

మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. వేంసూరు మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో 29 రేషన్ దుకాణాలు ఉండగా ఆయా దుకాణాల పరిధిలోని 14,446 ఉన్నాయి. కొత్త కార్డుల కోసం 425 దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి కొత్త కార్డుల నమోదుకు ఆన్‌లైన్ సైట్ తొలగించడంతో రేషన్‌కార్డు నమోదు అవకాశం లేకుండా పోయింది. అదే విధంగా పేరు మార్పులు చేర్పుల కోసం 508 మంది దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా అతి గతి లేకుండాపోయింది.

సంక్షేమ పథకాలకు దూరం..

ఆరోగ్య శ్రీ సేవలకు, ఉపకార వేతనాలు పొందడానికి, ఆదాయం ఇతర ధ్రువీకరణ పత్రాలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరుకు, ఇతర సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డే ప్రధాన ఆధారం. కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు కొత్త కార్డులు ఎప్పుడు వస్తాయా.. అని ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వ జాప్యం వల్ల అర్హులైన వారు డబుల్ బెడ్ రూం ఇళ్లతో పాటు, ఉపకారవేతనాలు, కల్యాణలక్ష్మి, ఆరోగ్యశ్రీ, ఇతర సంక్షేమ పథకాలు కోల్పోతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకుని నాలుగేళ్లు అవుతుంది



కొత్త రేషన్ కార్డు కోసం దరాఖాస్తు చేసుకుని నాలుగేళ్ళు గడుస్తుంది.నాకు పిల్లలు పుట్టి వారు పాఠశాలకు సైతం వెళ్తున్న రేషన్ కార్డు మాత్రం రాలేదు.పిల్లల చదువులకు ,ఆస్పత్రికి వెళ్ళినప్పుడు ఇబ్బంది గా మారుతుంది. ప్రభుత్వం స్పందించాలి.

– జంగ జమలయ్య, చౌడవరం

కొత్త కార్డులు మంజూరు చేయాలి



రేషన్ కార్డు లేనందున పలు రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. ఆరోగ్య శ్రీ అందక ఇబ్బంది పడుతున్నాం,ప్రతి పథకానికి రేషన్ కావలని చెప్పే ప్రభుత్వం కొత్త కార్డులు మంజురు చేయకపోవడం విచారకరం.తక్షణమే కొత్త కార్డులు మంజురు చేయాలి.

– చీపు నరసింహారావు, మర్లపాడు

నేడు ఎంపీలు బండి, వద్దిరాజు రాక

సత్తుపల్లి/ వేంసూరు/ కల్లూరురూరల్ : వేంసూరు మండలం కందుకూరుకు మంగళవారం ఎంపీలు బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర రానున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. కందుకూరులో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను సోమవారం పరిశీలించిన ఆయన రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎద్దుల బల ప్రదర్శన, కబడ్డీ పోటీలకు ఎంపీలు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నుంచి కార్ల ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా, ఈనెల 20వ తేదీలోగా మంత్రి హరీశ్‌రావు కల్లూరు, పెనుబల్లి ప్రభుత్వాస్పత్రుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతో పాటు దొడ్డా శంకర్‌రావు, చల్లగుండ్ల కృష్ణయ్య, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మౌలాలీ, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, బండి గోపిరెడ్డి, తెలగవరపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, కల్లూరు మండలం చంద్రుపట్ల సర్పంచ్ గొల్లమందల ప్రసాద్‌ను ఎమ్మెల్యే సండ్ర పరామర్శించారు.



కందుకూరులో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



సత్తుపల్లిటౌన్: ఉత్తమ మహిళా కండక్టర్లను సత్కరిస్తున్న జడ్జి అరుణకుమారి, డీఎం రాజ్యలక్ష్మి

మధిర/ ముదిగొండ/ సత్తుపల్లిటౌన్/ బోనకల్/ వైరారూరల్: జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ముదిగొండ మండల కేంద్రంలో, సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో, బోనకల్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో, వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో మహిళా దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధిరలో లియో క్లబ్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురి మహిళా ఉద్యోగులను సన్మానించారు. ముదిగొండలో ప్రజ్వలయువజన సంఘం ఉషశ్రీ సోషల్ సర్వీస్, దిశ కమిటీ ఆధ్వర్యంలో, సత్తుపల్లిలో మండలంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం సాధించిన మహిళా కండక్టర్లు జి.వరలక్ష్మి, కె.రేణుక, ఎ.శ్రీదేవిలను శాలువా, సర్టిఫికెట్లతో అభినందించారు. బోనకల్‌లోని ఐకేపీ కార్యాలయంలో వేడుకలను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచి పెట్టారు. వైరాలో ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఆర్.భారతితో పాటు మహిళా సిబ్బందిని శాలువాలతో సన్మానించి మహిళ దినోత్సవ షీల్డ్‌లను అందించారు. ఈ కార్యక్రమాల్లో డిస్ట్రిక్ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ మీనాక్షి, ఏఓ రాధ, డాక్టర్ అరుణదేవి, ఆర్ఐ వహీదా, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, సూపరింటెండెంట్ జయరాజు, ఎస్‌ఎం గడ్డెం శ్రీనివాస్, ఎంఎఫ్ వెంకటనారాయణ, మహిళా కండెక్టర్లు, ఉద్యోగులు, ఎంపీడీఓ వేణుమాదవ్, అడ్వకేట్ వెంకట్రావ్, ఏసీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్లు రమాదేవి, సుజాత, ఏపీఎం పద్మలత, సోని, ఎంపీపీ సౌభాగ్యం, అంగన్‌వాడీ టీచర్లు, ప్రిన్సిపాల్ ఏఎల్‌ఎన్ శాస్త్రి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ శీలం ఇందిరా రెడ్డి, ఎస్‌కె అఫ్రోజ్, లక్ష్మీనారాయణ, డాక్టర్ వీరన్న, సిబ్బంది, సర్పంచ్ అమ్మిక రామారావు, ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు అండగా హెటిరో ఫౌండేషన్

కల్లూరు/ఏన్కూరు/తల్లాడ/సత్తుపల్లిరూరల్: టీబీ బాధితులకు అండగా హెటిరో ఫౌండేషన్ ఉందని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాములు, వైద్యాధికారి నవ్యకాంత్, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, డాక్టర్ రత్న మనోహర్, డాక్టర్ అవినాష్ అన్నారు. సోమవారం కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో, ఏన్కూరు స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో, సత్తుపల్లిలోని గంగారం పీహెచ్‌సీలో టీబీ బాధితులకు వారు న్యూట్రిషియన్ కిట్లను అందించి మాట్లాడారు. ఈ ఫుడ్ బాస్కెట్‌లో మంచినూనె, కందిపప్పు, బెల్లం, రైస్, ఇడ్లీ రవ్వ, పల్లీలు, గోధుమ పిండి, మిల్క్ పౌడర్‌లు ఉంటాయని ఇవి వారికి ఎంతగానో ఉపయోగ పడతాయని స్పష్టం చేసారు. టీబీ పేషెంట్లు కాంటాక్ట్ పర్సన్స్‌ని కూడా స్క్రీనింగ్ చేసి వారికి ఎలాంటి లక్షణాలు లేకపోతే వారిలో టీబీ ఇన్ఫెక్షన్ గుర్తించడానికి ఐజీఆర్‌ఏ, టీబీ గోల్డ్ టెస్ట్ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రక్త నమూనాలను తీసుకోవడం జరుగుతుందన్నారు. వాటిని టీ హబ్ వెహికిల్ ద్వారా ఖమ్మం పంపిస్తున్నామని, ఎవరికైనా ఇన్ఫెక్షన్ ఉన్నట్‌లెతై వారికి ఆరు నెలల పాటు టీబీ ప్రివెంట్యు తెరిపి కింద మందులు అందిస్తున్నామని, ఈ మందులు, పరీక్షలు పూర్తి ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రేవతి, టీబీ సూపర్‌వైజర్ సురేష్, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సులు కళావతి, రమణ, ల్యాబ్ టెక్నీషియన్, కమ్యూనిటి హెల్త్ ఆఫసీర్ శివరాజు, ఫార్మసిస్ట్ అర్జున్, భాస్కర్, పెద్ద పుల్లయ్య, టీబీ నోడల్ పర్సన్ పి.నర్సింహారావు, ఎస్‌టీఎస్ సురేష్, డి.శ్రీనివాస్, సీనియర్ వైద్యుడు భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ భాస్కర్‌నాయక్

పొంగులేటి వెంటే ప్రయాణం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ఎంపీటీసీ–1 గోవింద్ విజయమ్మ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడవనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు సోమవారం కల్లూరు మండలం నారాయణపురంలో విజయమ్మ – గోవింద్ శ్రీనివాసరావు దంపతులు పొంగులేటిని కలిసి మాట్లాడారు. నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్‌రావు, నారపోగు వెంకటేశ్వర్‌రావు, పొన్నం కృష్ణయ్య, యర్రి నర్సింహారావు, షేక్ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మధిర: రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అందిస్తున్న చేయూతతో బ్రాహ్మణులు ఆర్థికాభివృద్ధి సాధించాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మధిర అధ్యక్షుడు వేమవరపు వెంకటేశ్వర శర్మ సూచించారు. పరిషత్ నుంచి మంజూరైన ఆర్థికసాయంతో భీమవరపు రామారావు ఏర్పాటుచేసిన టీ స్టాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మీసుబ్రహ్మణ్యశాస్త్రి, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, రామభద్రం, సుప్రియ, జక్కేపల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ముదిగొండ: మహిళలు హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాదులు కల్యాణి, స్వప్న సూచించారు. ముదిగొండలోని రైతువేదికలో సోమవారం ఏర్పాటుచేసిన సదస్సులో వారు మాట్లాడారు. సర్పంచ్ మందరపు లక్ష్మితో పాటు సంధ్యారాణి, రాజకుమారి, సావిత్రి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.25వేలు వితరణ

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి జెడ్పీ పాఠశాలకు పూర్వ విద్యార్థి గుత్తికొండ ఉమామహేశ్వరి సోమవారం రూ.20 వేలు వితరణ అందించారు. పది చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి కోసం రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం జయరాజు, ఉపాధ్యాయులు నర్సింహారావు, వెంకటేశ్వర్లు, చిట్టికుమారి, పద్మావతి, బాల నాగేశ్వరరావు, కల్యాణశర్మ, జాన్‌బీ, సురేష్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

కల్లూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని కల్లూరు ఎస్సై రఘు, ఎంఈఓ దామోదర ప్రసాద్, ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండల తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిలు అన్నారు. విజ్ఞాన్ విద్యాలయం వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో కష్టపడి చదువుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. పాఠశాలలో చదవి మెడిసెన్‌లో సీటు సాధించిన రుషీ ప్రీతమ్, ఎస్‌కే రేష్మలను ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాలయం కరస్పాండెంట్ ఎస్‌కే ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాలల రిటైర్డ్ ఆర్‌సీఓ పుల్లయ్య, కృష్ణయ్య, విజ్ఞాన్ విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామికి ఎదుర్కోలు ఉత్సవం



కల్లూరులో స్వామివారి ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామల ఎదుర్కోలు ఉత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు సౌమిత్రి రామాచార్యులు, మధుసూదనశర్మలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెండ్లికి ముందురోజు కప్పలబంధం రోడ్‌లోని తేరుబావి ఆంజనేయస్వామివారి గుడి వద్ద కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల పరిచయ వేదిక, గోత్ర, ప్రవర కార్యక్రమాలు పరిచయాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి ఎదుర్కోలు ఉత్సవాల వరకు శేషవాహనం పై ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కృష్ణ, నరసింహారావు, జానకిరామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణానికి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ముస్తాబు

చింతకాని: మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో శ్రీ భూ, నీలాదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి తిరుకల్యాణం మంగళవారం రాత్రి జరుగనుంది. ఈమేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడమే ఇతర ఏర్పాట్లుపూర్తిచేశారు. కాగా, సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా, మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజల అనంతరం రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణాన్ని వేదపండితులు నిర్వహిస్తారని ఆలయ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఈఓ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. అలాగే, మండలంలోని సీతంపేటలో శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో గజగిరి లక్ష్మీనర్సింహాస్వామి(పానకాల స్వామి), కోమట్లగూడెంలో అంకమ్మ తల్లి అంకమ్మ తల్లి కల్యాణాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.



కల్యాణానికి ముస్తాబైన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి


మధిర: మండలం నుంచి సరిహద్దు రాష్ట్రానికి తరలి వెళ్తున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్‌లో సోమవారం స్థానిక తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం పక్క రాష్ట్రం నుంచి లారీలు అధిక లోడుతో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారని తెలిపారు. ఈ లారీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మధిర సమీపంలోని వైరా నది, కట్టలేరు నదుల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు రమేష్, స్వర్ణాకర్, నాగభూషణం, మోహన్ రావు, రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

తల్లాడ: ఈ నెల 10న హైదరాబాద్‌లో రవన్న (రాయల సుభాష్ చంద్రబోస్) ఏడో వర్ధంతి సభ వాల్ పోస్టర్లను సోమవారం తల్లాడలో ఐఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వెంకన్న చేతుల మీదుగా ఆవిష్కరించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా పంథా జిల్లా కార్యదర్శి ఎస్‌కే లాల్‌మియా, ఏన్కూరు మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, పటాన్ నాగుల్‌మీరా, యాకూబ్, వెంకటి, నరేష్, రాఘవ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

తల్లాడ: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వైఎస్‌ఆర్ హయాంలో మాదిరి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఏఐసీసీ సభ్యుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నూతనకల్, మిట్టపల్లి, లక్ష్మీపురం, రామానుజవరంల్లో జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇల్లుతో పాటు, ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు రాజ్యాన్ని తెస్తామని తెలిపారు. నాయకులు కొండూరి కిరణ్, దగ్గుల రఘుపతిరెడ్డి, సుధాకర్, రోశయ్య, రమేష్, కటికి కిరణ్, ఎర్రి కృష్ణారావు, నాగిరెడ్డి, రవీంద్ర, కేవీ.నాయుడు, జమాల్, కాంతారావు, యాకోబు, వెంకటేశ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

తాగునీటి వృథాకు అడ్డుకట్ట పడేదెన్నడూ..?

వైరా: వైరా బస్టాండ్ వెనుక కామిశెట్టి కల్యాణ మండపం ఎదుగుగా నేషనల్ హైవే కింద ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పైపులైను పగిలి నీరు వృథాగా పోతోంది. నాలుగు నెలల క్రితం పైపులైను పగలగా మున్సిపల్ సిబ్బంది రెండు రోజుల క్రితం నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. మళ్లీ అక్కడే పైపులైన్ కావడంతో నీరు వృథాగా పోతూ 7, 8వ వార్డుల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లీకైనా పైపులైనుకు మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కరం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



పైపు లీకేజీతో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

మధిర: మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని తెలిపారు. తరగతి గదిలోని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గొప్ప అవకాశం ఒక ఉపాధ్యాయుడికి మాత్రమే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, కంచిపోగు ఆదాం, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, బానోత్ బావ్ సింగ్, వేము రాములు, గుంటుపల్లి రమాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రుపాలెం/ముదిగొండ/సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొగ్గుల లక్ష్మి, శీలం రాధమ్మలు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారాం అన్నారు. మండలంలోని ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో, ముదిగొండలోని పండ్రేగుపల్లిలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్తుపల్లిలోని గుడిపాడు కంటి వెలుగు కేంద్రాన్ని సీతారం పరిశీలించారు. ఈ శిబిరంలో 315 మందికి వైద్యులు రవిరాజా, సాయికిరణ్‌లు పరీక్షలు నిర్వహించారు. 69 మందికి కళ్ల అద్దాలను అందిచి 21మందిని ఆపరేషన్ కోసం ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సెక్రటరీ శివ మాధవ్, హెచ్‌ఈఓ సదాశివరావు, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సాయిరెడ్డి, ఏఎన్‌ఎంలు రత్నమాల, నాగమణి, రాణి, కామేశ్వరి, రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైద్యాధికారిణి అరుణదేవి, సీహెచ్‌ఓ దుర్గామల్లేశ్వరీ, సర్పంచ్ ఓబినబోయిన అమరయ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, గంగారం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అవినాష్, సూపర్‌వైజర్లు అన్నమ్మ, నర్సింహారావు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారాం